జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 20-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 143 పేజీలు: 8 వెల: రూ.7




## టార్గెట్..
# ఉమెన్ హాస్టల్స్!

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 19 (వార్త): శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి శుక్రవారం పరారైన యువతిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గుర్తు తెలియని యువతి వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌ను టార్గెట్ చేసుకుని చోరీకి పాల్పడుతోంది. శుక్రవారం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రి ఆవరణలోని ఓ వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో దూరి చోరీకి పాల్పడుతుండగా, సిబ్బంది పట్టుకుని శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఆమె పరారైంది. ఆమెను పట్టుకోకపోవడంతో శనివారం తిరిగి ఆ యువతి శ్రీకాకుళం నగరంలోని కోర్టు వెనుకవైపు ఉన్న కాలనీలో వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో దూరి.. గుట్టుచప్పుడు కాకుండా ల్యాప్‌టాప్‌ను దొంగిలించింది. తన పని ముగించుకుని సైలెంట్‌గా ఆమె వెనుదిరిగింది. అయితే హాస్టల్‌లో ల్యాప్‌టాప్ పోయిందని అక్కడున్న మహిళలు తెలుసుకుని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్టల్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని యువతి హాస్టల్‌లో కి దూరి ల్యాప్‌టాప్‌ను దొంగిలించి పరారైనట్టు గుర్తించారు. ఆమె ఎటువైపు వెళ్లిందన్న దానిపై నగరంలోని పలు కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. గుర్తుతెలియని మహిళ వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌ని టార్గెట్ చేసుకుంటుండడంతో సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. కొత్తవారు ఎవరూ రాకుండా తగు చర్యలు చేపడుతున్నారు. పోలీసులు మరింత లోతుగా విచారణ చేపట్టి ఆమెను పట్టుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

* వరుస చోరీలకు పాల్పడుతున్న గుర్తు తెలియని యువతి
* రాగోలు జెమ్స్, శ్రీకాకుళం నగరంలోని హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు దొంగతనం
* రూరల్ పీఎస్ నుంచి పరారైన పట్టుకోవడంలో పోలీసులు విఫలం



## సీసీఎస్‌లో.. సిబ్బంది కొరత

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ క్రైం స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. దీనివల్ల జిల్లాలో నేరాల సంఖ్య అదుపులోకి రావడం లేదు. చాలా వరకూ కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ ఏడాది జూన్ నెలలో నరసన్నపేటలో ఓ వైద్యుడి ఇంట్లో 100 తులాల బంగారం చోరీకి గురైంది. అలాగే శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న ఓ ఇంటిలో దొంగతనం జరిగింది. అలాగే జిల్లాలో అధికంగా చోరీలు జరుగుతున్నా పూర్తిస్థాయిలో పోలీసులు పట్టుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో సెంట్రల్ క్రైం స్టేషన్‌లో చురుకైన సిబ్బంది ఉండడంతో కేసులు సత్వరం పరిష్కరించేవారు.. ప్రస్తుతం సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో కేసుల పరిష్కారంలో జాప్యమవుతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా పోలీస్‌బాస్ స్పందించి సీసీఎస్‌లో పూర్తిస్థాయిలో సమర్థులైన సిబ్బందిని నియమిస్తే నేరాలకు పాల్పడేవారిని పట్టుకునే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వృద్ధురాలి మెడలో పుస్తెలు చోరీ



**మెళియాపుట్టి, అక్టోబర్19 (వార్త):** సంతలక్ష్మీపురం పంచాయతీలో గల టకోయి గ్రామానికి చెందిన పల్లె కనకమ్మ (63) అనే వృద్ధురాలు శుక్రవారం సాయంత్రం ఇంటిలో వంట చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి చొరబడి మెడలోనున్న మూడున్నర తులాల విలువ గల బంగారు పుస్తెలను అపహరించాడు. దీంతో ఆమె మెళియాపుట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామారావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వృద్ధురాలి నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

# అక్రమార్కులు గుప్పెట్లో.. నెమలికొండ

* కొండను తవ్వేసి.. కంకర తరలింపు
* సర్కార్ భూమిపై అక్రమ లేఅవుట్
* చోద్యం చూస్తున్న అధికారులు



**పలాస, అక్టోబర్ 19 (వార్త):** పచ్చదనంతో కళకళలాడుతున్న నెమలికొండపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. కొంచెం కొంచెంగా కంకరను తవ్వేస్తూ కొండను చదును చేసేస్తున్నారు. కొండపై ఉన్న చెట్లను తొలగించేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో కొందరు కొండను తవ్వేసి కంకరను పెద్ద ఎత్తున తరలిస్తూ కాసులు చేసుకుంటున్నారు. కొందరు అధికారులకు అమ్యామ్యాలు అందడంతో అటువైపుగా కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పలాస మున్సిపాలిటీ పరిధిలోని నెమలిగిరిగా ప్రసిద్ధ చెందిన నెమలి కొండ అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. కొండ చుట్టూ అక్రమార్కుల ఆక్రమణలతో నిండిపోయింది. కొన్ని రోజులుగా నెమలికొండ దిగువ భాగం ముస్లిం కాలనీ వైపు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. పలాస - కాశీబుగ్గ పట్టణాలకు చెందిన కొందరు అక్రమార్కులు కొండను తొలిచి గ్రావెల్ వ్యాపారం చేస్తు లక్షలాది రూపాయలు అర్జిస్తున్నారు. ఆపైనా ప్రాంతమంతా ఆక్రమించుకుని పక్కనున్న జిరాయితీ సర్వే నెంబరు వేసుకుని విక్రయాలు చేపడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నెమలి కొండ దిగువ భాగాన్ని చదును చేస్తూ ఎంచక్కా లేఅవుట్లు వేస్తున్నారు. నెమలికొండ ముందర సూదికొండ సచివాలయం వెనుక గుట్టుచప్పుడు కాకుండా తవ్వేస్తున్నారు. ఈ కొండకు సమీపంలో పలాసకు చెందిన ఓ రైతుకు దిగువ భాగంలో జిరాయితీ భూమి ఉండేదని దీనికి సంబంధించి విక్రయాలు జరిగిపోయినట్లు బోగట్టా. తాజాగా అదే జిరాయితీ సర్వే నంబర్ ను చూపించి కొండ దిగువ భాగంలో ప్రభుత్వ భూమిలో ఆక్రమాలకు తెరలేపారు. చదును చేసి లేఅవుట్‌గా మార్చిన స్థలం విలువ రూ.2 కోట్లు వరకు అంటుందని కొందరు చెబుతున్నారు. నెమలికొండలో అక్రమ తవ్వకాలు, లేఅవుట్లపై పలాస తహశీల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా నెమలికొండలో ఆక్రమణకు గురైందని తమకు ఫిర్యాదు రావడంతో పరిశీలించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామన్నారు.




# వైసీపీ పాలనలోనే పల్లెల్లో పండుగ



**ఆమదాలవలస, అక్టోబర్ 19 (వార్త):** కూటమి ప్రభుత్వం ఈ నాలుగు నెలల్లో గ్రామాల్లో చేసింది ఏమీ లేకపోయినప్పటికీ పల్లె పండుగ పేరుతో హడావుడి సృష్టిస్తున్నారని వైసీపీ నాయకుడు చిరంజీవి నాగ్ (నాని) అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైసిపి సర్కార్ ఐదేళ్లపాటు నిర్విరామంగా అభివృద్ధి సంక్షేమం కొనసాగించిందని తమ ప్రభుత్వం కాలంలోనే గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఏదో చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది తప్ప ఏమీ చేయడం లేదన్నారు. గ్రామ పాలనకు అవసరమైన సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు వంటి నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నాడు నేడు కార్యక్రమంలో భాగంగా బడుల రూపురేఖలను మార్చామన్నారు. ప్రజలకు నేరుగా డిబిటి ద్వారా రెండు లక్షల 50 వేల కోట్లు వారి అకౌంట్లో జమ చేసామన్నారు. వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పాలన ప్రజలకు చేరువు చేశామని తెలిపారు. కొత్త మద్యం పాలసీ కేవలం కూటమి నేతలకు ఆదాయ వనరుగా మిగిలిందని విమర్శించారు. కొత్త మద్యం పాలసీ వలన 15వేల మంది రోడ్డున పడ్డారన్నారు. పాత సీసాలో కొత్త సార మాదిరిగా ఉందని ఎద్దేవా చేశారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై, స్థానిక ఎమ్మెల్యే రవికుమార్ చేసిన విమర్శలు అర్ధరహితమన్నారు. మంత్రివర్గంలో చోటు లేకపోవడం ఫ్రస్ట్రేషన్‌కు గురై అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. బలసల రేవు వంతెన పూర్తి చేయాలన్నారు, గత ప్రభుత్వంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, హార్టికల్చర్ స్టేషన్ వంటి విద్యా సంస్థలకు శాశ్వత భవనాలు తీసుకువచ్చి వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని నాని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎ.ఉమామహేశ్వరరావు, పి.చిన్నారావు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

* సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి నియోజకవర్గ సమస్యలు
* నాగావళి నదికి రక్షణగోడ నిర్మాణంపై చర్చ
* ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం టౌన్, అక్టోబరు 19 (వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తనకు వచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి, ఇతర శాఖల మంత్రుల దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్తూ వాటికి పరిష్కారం అందించే దిశగా కృషి చేస్తూ నియోజకవర్గ అభివృద్ధే ధ్యాసగా, శ్వాసగా ముందుకు కదులుతున్నారు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్ సీఎం చంద్రబాబునాయుడును కలుసుకొని నియోజకవర్గ సమస్యలపై నివేదికలను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో మాట్లాడుతూ బందరువానిపేట, పీజీపేటలో ఫిష్ ల్యాండింగ్ జెట్టీ నిర్మాణం కోసం, నాగావళి నది కొత్త వంతెన వద్ద కుడివైపు రక్షణగోడ నిర్మాణం కోసం, వంశధార నది కళింగపట్నం వద్ద సముద్రంలో కలిసే దగ్గర గ్రోన్, దిశ మార్పు కోసం గోడ నిర్మాణం చేపట్టాలని, కళింగపట్నం బీచ్ అభివృద్ధి కోసం, అదే విధంగా నాగావళి నది పీజీపేట దగ్గర సముద్రం కలిసే దగ్గర బీచ్ ఎంక్రోచ్‌మెంట్ అవ్వకుండా గోడ నిర్మాణం కోసం ప్రతిపాదనలను చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు ఎమ్మెల్యే వివరించారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చిస్తూ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నివేదికలను సిద్ధం చేయాలని త్వరలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పరిష్కారం చూపేందుకు సిద్ధమైన గొప్ప విజన్ కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే శంకర్ చెప్పారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుల సహకారంతో త్వరలో ఈ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.



## ఉత్తమ సేవలే యూనియన్ బ్యాంక్ లక్ష్యం

**మందస, అక్టోబరు 19(వార్త):** ఉత్తమ సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ లక్ష్యమని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ అన్నారు. మందస పట్టణంలోని కరణంవీధి(పోస్టాఫీసు దగ్గర)లో శనివారం యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు బ్యాంక్ సేవలను విస్తరిస్తున్నామన్నారు. ఎంతో నమ్మకం, ఉత్తమ సేవలతో యూనియన్ బ్యాంకులు పని చేస్తున్నాయన్నారు. బ్యాంక్ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్.విద్యాధరరావు, ఏబీఎం శ్రీనివాస్, కిల్లంశెట్టి వెంకటరమణ, సత్యం, మోణంగి నాగేశ్వరరావు, వడ్డి గోపాలకృష్ణ, బరాటం జయప్రకావ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పారావు మాస్టారు సేవలు శ్లాఘనీయం



**బూర్జ, అక్టోబరు19(వార్త):** ఓవీపేట గ్రామానికి చెందిన కొత్తకోట అప్పారావు మాస్టర్ ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ శని వారం ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అప్పారావు మాస్టారు ఎనలేని సేవలందించారని, తన వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు కీర్తికిరీటాలను అధిరోహించారని, ఉపాధ్యాయుడిగా ఆయన సేవలు శ్లాఘనీయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ కొనియాడారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం మాట్లాడుతూ మాస్టారు గ్రామంలో తలలో నాలుకలా మెలిగారని, ఆయన సేవలకు ఉత్తమ ఉపాధ్యాయుడుగా ప్రభుత్వ సత్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు. అలాగే రోడ్డు ప్రమాదానికి గురైన సీహెచ్ లక్ష్మణరావును పరామర్శించారు. పరామర్శించిన వారిలో బుడుమూరు సత్యం మాస్టర్, బొడ్డేపల్లి సూర్యారావు, స్థానిక నేతలు ఉన్నారు.

## పాఠాలు బోధించిన ఎంఈవో



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** నరసన్నపేట మండలం మడపాం ప్రాథమిక పాఠశాలలో శనివారం మండల విద్యాశాఖ అధికారి శాంతారావు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచటానికి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**శ్రీకాకుళం టౌన్, అక్టోబరు 19 (వార్త):** ఆర్టీసీలో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రెంటిస్‌షిప్‌కు ఐటిఐ పాసయిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. విజయకుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 20 నుండి 31లోగా www apprentice-ship. gov.in వెబ్సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలన నిమిత్తం నవంబర్ 7 వ తేదీన ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి. అగ్రహారం లోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలు, సందేహాలు నివృత్తి కోసం 08922-294906 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చు అని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## జాబ్ కార్డు మంజురుపై ప్రత్యేక దృష్టి సారించండి

**శ్రీకాకుళం, అక్టోబర్ 19(వార్త):** జాబ్ కార్డు మంజురుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అర్హత ఉన్న వారికి జాబ్ కార్డు మంజురు కాలేదని ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం 18 సంవత్సరాలు నిండినవారు రూరల్, అర్బన్ లో ఎంతమంది ఉన్నారు, అలాగే ఛానల్ పనుల నిర్వహణపై ఆరా తీశారు. మండలాల వారీగా మంజూరు చేసిన జాబ్ కార్డులు, నిర్దేశిత లక్ష్యాలు సాధించిన ప్రగతిపై ఆరా తీశారు. గ్రామ సభలు నిర్వహించి జాబ్ కార్డులపై రివ్యూ నిర్వహించాలన్నారు. జాబ్ కార్డులు మంజురులో ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏపీఓ పై క్రమశిక్షణా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎపీడీలు, ఎపిఓలు, ఇసిలతో సహ పలువురు అధికారులు, డ్వామా సిబ్బంది హాజరైయ్యారు.



## నవంబరు 6 వరకు
# ఉపాధ్యాయ ఓటర్ల నమోదు
### జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు


**శ్రీకాకుళం, అక్టోబర్19 (వార్త):** ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి సెప్టెంబర్ 30వ తేదీన నోటిఫికేషన్ వెలువడిందని, అదే రోజు నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. అయితే నవంబరు 6వ తేదీన ఓటర్ గా నమోదుకు చివరి తేదీగా నిర్ణయించామని స్పష్టం చేశారు. నవంబరు 23న ఇందుకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి కె తవిటి నాయుడు, సి సెక్షన్ సూపరెంటెండెంట్ రాజేశ్వర రావులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చి 29వ తేదీకి ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గడువు ముగుస్తుందని, ఈ నేపథ్యంలో సంబంధిత ఓటర్ల జాబితా రూపకల్పనపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆయా జిల్లాల పరిధిలో నియమించిన అధికారుల వద్ద గానీ, ఆన్‌లైన్ విధానంలో గానీ ఫారం-19 సమర్పించవచ్చని చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి నుండి (ఆరో తరగతికి పైబడి) పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని స్పష్టం చేశారు. పార్ట్ టైమ్ విధానంలో పనిచేసే వారు అర్హులు కారని అన్నారు. ఓటు నమోదులో భాగంగా స్వీయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత సంస్థ హెచ్ఓడి నుంచి సర్టిఫికేట్ తీసుకొని సమర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వీటితోపాటు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్ చేసిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కళాశాల స్థాయిల్లో పనిచేసే వారు సంబంధిత ఆర్‌జెడిల కౌంటర్ సైన్‌తో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందన్నారు. యూనివర్శిటీ స్థాయిలో పనిచేసేవారు విసి నియమించిన అర్హత గల అధికారుల నుంచి కౌంటర్ సైన్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గత ఆరేళ్లలో సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యాసంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పనిచేసిన ఉపాధ్యాయులు అర్హులన్నారు. వారంతా నవంబరు 6వ తేదీ లోగా ఫారం-19 సమర్పించటం ద్వారా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. గతంలో ఓటు ఉన్న వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, పాత ఓటు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. అలాగే ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలో ఓటు వేయడానికి అవకాశం లేదని, ఓటు వేయడానికి ఆధార్ కార్డు చిరునామా పరిధిగా నిర్ణయించామని, 2024 సంవత్సరానికి ముందు గడిచిన ఆరు సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాలు ఉపాధ్యాయ విధులు నిర్వహించిన వారు మాత్రమే ఓటు నమోదుకు అర్హులుగా డిఆర్ఓ పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు అధిక శాతంలో నమోదు అయ్యేలా సహకరించాలని ఉద్యగ సంఘాలకు ఆయన పిలుపునిచ్చారు.

## బాధితుడి కుటుంబానికి పరామర్శ

**జలుమూరు, అక్టోబర్19(వార్త):** పోలాకి మండలం బెలమర గ్రామంలో ఇటివల ప్రమాదంలో గొర్ల చిన్నవాడు మృతి చెందాడు. ఆ కుటుంబ సభ్యులను నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి బలగ ప్రవీణ్ కుమార్‌తో పాటుగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి యోగహరి, ప్రశాంత్, వంశీ, అజయ్, మహేష్, డిల్లీ, రాము, టీడీపీ నాయకులు సింహాద్రి పరామర్శించారు.

## శాశ్వత అన్నదానానికి వితరణ

**అరసవల్లి, అక్టోబరు 19 (వార్త):** సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదానానికి శ్రీకాకుళం వాస్తవ్యులు బుర్ర రాంబాయ్, ఎస్. శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,116లను ఆలయ ఈవో భద్రాజీకి అందజేశారు. అంతకుముందు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.



## కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితుల..
# కాలనీ నిర్మాణానికి చర్యలు

*** జెట్టీ ఏర్పాటుకు అధ్యయన కమిటి పరిశీలన * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, అక్టోబర్19(వార్త):** కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితులతో ఎచ్చెర్ల నియోజకవర్గం శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రానికి భూ సేకరణ పూర్తి కాగా భూమి ఆక్రమణ కాకుండా సంరక్షించుకోవాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సౌకర్యాలు పై కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ ప్రసాద్ చర్చించాలన్నారు. నిదులు వచ్చిన వెంటనే రహదారులు పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మించాల్సి ఉందన్నారు. తాగునీరు, రహదారి, డ్రెయినేజీ సమస్యలు గూర్చి ప్రజలు చెప్పినట్లు చెప్పారు. నిర్వాసితులకు నిర్మించబోయే ఆర్ అండ్ ఆర్ కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్, సచివాలయాలు, ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ, సైక్లోన్ సెంటర్, బస్సు షెల్టర్, పోస్టాఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రహదారులు, దేవాలయాలు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని యాజమాన్యం వివరించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో తాగునీటి అవసరాల కోసం ధర్మవరం వద్దనున్న పెద్ద చెరువును రిజర్వాయర్ చేయడం కానీ నాగావళి నడినుండి వైపు లైన్ ద్వారాగాని అధ్యయనం చేయించి తీసుకు వస్తాము అని శాసన సభ్యులు గ్రామస్తులు తాగునీటి కోసం అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. కోల్డ్ స్టోరేజ్, జెట్టీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అణు విద్యుత్ కేంద్రం వస్తే కంపెనీలు వస్తాయని తెలిపారు. ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. చెన్నై, బెంగళూరు నుండి టీంల వస్తాయని జెట్టీ ఏర్పాటుకు సంబంధించి సాధ్యా సాధ్యాలను అధ్యయనం చేస్తాయని కలెక్టర్ వివరించారు. నిర్వాసితుల భూములకు సంబంధించి 21 మందికి పేమెంట్ చేయాలని శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు చెప్పగా రణస్థలం తహసీల్దార్ ఎన్.ప్రసాద్ రావు ఆర్డీవో గారికి ప్రతిపాదనలు పంపడమైనదని మంజూరు అయి వచ్చిన తర్వాత పేమెంట్స్ చేస్తామన్నారు. మిగిలిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




గ్రామ కంఠంలోని చెట్లకు నష్టపరిహారం అందజేయాలని అణు విద్యుత్ కేంద్రం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను ఆయన ఆదేశించారు. అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తి అయితే ఒక్కో ఇంటికి ఒక ఉద్యోగం అవకాశం కల్పించాలని శాసన సభ్యులు కలెక్టర్ ను కోరారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టుకోవాలని అణు విద్యుత్ కేంద్రం యాజమాన్యానికి తెలిపారు. ధర్మవరం మత్స్యలేషంలో అటవీ భూమి ఉన్నట్లు తేలిందని చెప్పారు. గ్రామాలకు సంబంధించి మౌలిక సదుపాయాలే కాకుండా అదనపు సౌకర్యాలు కల్పిస్తామని అణు విద్యుత్ కేంద్రం యాజమాన్యం వివరించారు. కొవ్వాడ, చినకొవ్వాడ, రామచంద్రాపురం, గూడేం గ్రామాలు ఎఫెక్ట్ అవుతున్నాయని బాధితులు తెలిపారు. ఫిషింగ్ జెట్టి, కోల్డ్ స్టోరేజ్, కేంద్రీయ విద్యాలయం, ఏర్పాటు చేయాలని నిర్వాసితులు కోరారు. ఆర్ అండ్ ఆర్ కాలనీని ఎంత త్వరగా నిర్మాణాలు పూర్తి అవుతాయో తక్షణమే కాలనీకి మారిపోతామని గ్రామస్తులు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. అప్పారావు, ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం స్పెషల్ తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం ఛీఫ్ ఇంజనీర్ ప్రసాద్, రణస్థలం తహసీల్దార్ ఎన్.ప్రసాద రావు, ఎచ్చెర్ల తహసీల్దార్ ఎ. సింహాచలం మత్స్య శాఖ జెడి శ్రీనివాసరావు, జి సెక్షన్ సిబ్బంది, కొవ్వాడ అణు విద్యుత్ పరిధిలోని గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించాలి

ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎచ్చెర్ల మండలానికి సాగునీరు, ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు, ఆర్ అండ్ బి రహదారులుపై ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నారాయణపురం రిజర్వాయర్ నుండి వస్తున్న సాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. నారాయణపురం ఆయకట్టు నుండి గుర్రపుడెక్క, సిల్ట్ ఉండడం వలన నీరు ఎచ్చెర్ల మండలం రావడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జూలై నెల నుండి ఎస్ఈ కి చెబుతున్నట్లు శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లస్కర్లు కాలువల్లో నీటికి అడ్డుకట్ట లేకుండా చూడాలని రైతులు తెలిపారు. ఎచ్చెర్ల మండలం నుండి నీరు ఎందుకు రావడం లేదని కలెక్టర్ ఈఈని అడుగగా నీరు వస్తోంది కాని చివరకు వచ్చేసరికి నీరు రావడం లేదని వివరించారు. గుర్రపుడెక్క తీస్తే నీరు వస్తుందని రైతులు చెప్పారు. లస్కర్లు జాబితా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. లస్కర్లు రేపటి నుండి వస్తారని చెప్పారు. నీరు వచ్చే విధంగా చూస్తామని ఈఈ తెలిపారు. పైలెట్‌గా తీసుకొని గుర్రపుడెక్కలను తొలగించాలని కలెక్టర్ ఈఈని ఆదేశించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ నుండి సిసి రోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు. తీర్మానాలు ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఇరిగేషన్ ఈఈ సుధాకర్, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ

**శ్రీకాకుళం, అక్టోబర్19(వార్త):** ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వర రావు శనివారం కలెక్టరేట్ ఆవరణలో చేప పిల్లలను సహకార సంఘాలకు పంపిణీ చేశారు. చేప పిల్లల 40 శాతం సబ్సిడీపై ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా అందజేయడం జరిగినట్లు చెప్పారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు మత్స్య శాఖ ద్వారా స్వదేశీ మత్స్యకార సహకార సంఘాలకు లీజుకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మత్స్య శాఖ జెడి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 183 ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఎడి సత్యనారాయణ, రణస్థలం తహసీల్దార్ ప్రసాద్, సహకార సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

### మత్స్య సంపద యోజన లబ్ధిదారులకు అందాలి

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన లబ్ధిదారులకు శతశాతం అందజేసేలా ప్రణాళికలు రూపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన లబ్ధిదారులకు శతశాతం అందజేసేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ ఉపసంచాలకుడు శ్రీనివాస రావు ప్రధాన మంత్రి మత్స్య సంరక్షణా యోజన క్రింద 2022-23 చేపట్టిన పనులు లబ్ధిదారులకు అందజేసిన పథకాలు తదితర వివరాలు వివరించారు. ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే ట్రాన్స్పాండర్స్ శత శాతం రాయితీపై మంజూరు చేయడం జరుగుతుందని. అందుకు సంబంధించి 48 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. డెవలప్మెంట్ ఆఫ్ క్లైమేట్ రెసిలియంట్ కోస్టల్ ఫిషర్మెన్ గ్రామాల క్రింద జిల్లాలో 3 గ్రామాల్లో 2 కోట్ల రూపాయల చొప్పున వ్యయంతో ప్రతిపాదనలు గ్రామ పెద్దలతో సంప్రదించి తయారు చేస్తామని తెలియజేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సిఈఓ శ్రీధర్ రాజు, ఎల్ డి ఎం సూర్య కిరణ్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ, ఎఫ్డిఓలు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## తుఫాన్ షెల్టర్ల పరిశీలన



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** పోలాకి మండలంలోని తుఫాన్ షెల్టర్లు పరిస్థితిని జిల్లా పరిషత్ సీఈవో, పోలాకి మండల పర్యవేక్షణ అధికారి శ్రీధర్ రాజా పరిశీలించారు. శనివారం పోలాకి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఆయన ఎంపీడీవో రవికుమార్తో కలిసి దండు లక్ష్మీపురం, గుప్పెడు పేట, కొత్తరేవులో ఉన్న తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వీటికి మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు.

# విద్యార్థులను బిడ్డల్లా చూడాలి





వీజీ పురం కేజీబీవీలో వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి కిశోర్‌బాబు, విద్యార్థినిలతో మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌బాబు

**మందస, అక్టోబర్ 19(వార్త):** వసతిగృహాల్లోని విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని అదనపు జిల్లా జడ్జి కె.కిశోర్‌బాబు అన్నారు. శనివారం ఆయన మందస మండలంలోని కేజీబీవీ(వీజీపురం), బీసీ బాలికల వసతి గృహం(మందస),బాలుర హాస్టల్(జీఆర్ పురం)ల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో పేద, సామాన్య కుటుంబాలకు చెందిన పిల్లలు మాత్రమే చదువుకుంటారని, వారి ఆలనా, పాలనా ఎంతో చక్కగా చూసుకోవాలన్నారు. భోజనాలు చక్కగా పెట్టాలని, విద్య, క్రమశిక్షణ నేర్పించాలన్నారు. అనంతరం ఆయా హాస్టళ్లలో వాష్‌రూంలు, వంట గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి.. విద్యా బోధన, ఉపాధ్యాయులు ప్రవర్తిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో మందస ఎస్ఐ ఎస్.కె. ఖాదర్‌బాషా, ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి, ఉపాధ్యాయినిలు పావని, ఉమా సుందరి, భాగ్యలక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, లావణ్య, మీనా, భవాని తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సమస్యలు-పరిష్కార మార్గాలపై నేడు సదస్సు



**మందస, అక్టోబర్ 19(వార్త):** మందస మండలంలోని హరిపురం-బాలిగాం జంక్షన్లో గల నరేష్ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ సమస్యలు-పరిష్కారమార్గాలు అనే అంశంపై ఆదివారం వ్యవసాయ సదస్సు నిర్వహిస్తున్నట్టు పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు, మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, చైతన రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. హరిపురంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ ఆర్థిక నిపుణుడు, రైతు స్వరాజ్య వేదిక వ్యవస్థాపకుడు కన్నెగంటి రవి వక్తగా వ్యవహరిస్తారన్నారు. వ్యవసాయ, అసంఘటిత కార్మిక చట్టాల తీరుతెన్నులపై వక్తగా పీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.అన్నపూర్ణ ప్రసంగిస్తారన్నారు. పలాస డివిజన్ వెనుకబాటుతనం, నివారణ మార్గాలపై డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పేడాడ కృష్ణారావు వక్తగా మాట్లాడుతారన్నారు. వంశధార కాలువను పలాస ఉద్దానం బొడ్డపాడు, వేపాడ చెరువు మీదుగా జంతిబంద, సంకుజోడు, దామోదర సాగర్, గోపాలసాగరంకు అనుసంధానం చేయాలన్నారు. తితిలీ తుఫానులో సర్వస్వం కోల్పోయి, ఒక్క పైసా కూడా అందని ఏడువేల మంది రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని, ఈ ప్రాంతంలో ప్రధాన పంటలు జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కొబ్బరి, జీడి బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పూర్తి కాని మినీ రిజర్వాయర్ల ప్రధాన ఛానళ్ల నిర్మాణం చేపట్టాలని, చెరువుల ఆక్రమణలు తొలగించి, పూడికలు సత్వరమే తొలగించాలని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు స్థాపించాలని, యువతకు ఉద్యోగాలు కల్పించి వలసలు నిరోధించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీలు, మరబోట్లు, చేపల రవాణాకి మినీ వేన్లు. నైలాన్ వలలను 75% రాయితీపై అందించాలని, ఆదివాసీల అభివృద్ధికి, ఐటీడీఏ సబ్ డివిజన్ మందసలో ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. కాయగూరలు పండించే పొందర్లు, కూరాకుల గ్రూపులుగా విభజనచేసి సామూహిక బోర్లు ఉచితంగా ఏర్పాటు చేయాలన్నారు. భోజనానంతరము కార్యదర్శి నివేదిక, సౌహార్ద ప్రతినిధులు సందేశాలు, మండల, నియోజకవర్గ స్థాయి సంఘ ఎన్నికల నిర్వహణ, తీర్మానాలు, వందన సమర్పణ ఉంటుందన్నారు. అందరూ సంయమనం పాటించి కార్యక్రమం సజావుగా సాగించాలని, జయప్రదం చేయాలని వారు కోరారు.

# ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి



**వంగర, అక్టోబర్ 19(వార్త):** ఉత్తరాంధ్రలో ప్రాజెక్టుల పూర్తికి ఈ నెల 22న అనకాపల్లిలో తలపెట్టిన ప్రాంతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన వంగర మండలంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా నీరందని గ్రామాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాజకీయ నాయకుల నిర్లక్ష్యంతో ఉత్తరాంధ్ర వెనుకకు నెట్టివేయబడుతోందని, అన్ని నీటి వనరులు, నదులు ఉన్నప్పటికీ అల్లుడు నోట్లో శని ఉందన్న చందంగా తయారైందన్నారు. రాష్ట్ర పాలితులు ఎవరైనప్పటికీ ఉభయగోదావరి, కృష్ణ, గుంటూరు వంటి జిల్లాల్లో కూలీల కొరతను తీర్చడానికి ఉత్తరాంధ్రను అభివృద్ధి కానివ్వకుండా అడ్డుకుంటున్నారని, ఈ ప్రాంత పాలకుల నిర్లక్ష్య వైఖరిపై విరుచుకుపడ్డారు. సాగునీటి వనరులు కలిగిన ఉత్తరాంధ్రను నేడు వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి, దీనస్థితికి పాలకులు నెట్టేశారని దీనికి రేగిడి ఆమదాలవలస మండలంలోని సాయన్న చానలే నిదర్శనమన్నారు. తోటపల్లి పాత కాలువ నుంచి సుమారుగా 3500 ఎకరాలకు సాగునీరందడం లేదని, కొత్తవలస, బంగారువలస, కొప్పరవలస, రుషింగి తలగాం, శివ్వాం, వంగర తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. సుమారు 8 లక్షల ఎకరాల సాగునీరు 1200 గ్రామాల్లో 30 లక్షల మంది ప్రజలకు తాగునీరు కల్పించే సౌలభ్యం ఉన్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు కావాల్సిన నిధుల మంజూరుకు పాలకులకు చేతులు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి రేగిడి ఆమదాలవలస మండలంలోని లచ్చన్నవలస, తోకలవలస, బూరాడ తదితర గ్రామాలకు చుక్కనీరు కూడా అందడం లేదని, మడ్డువలస రిజర్వాయర్ కింద ఆయకట్టు పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదన్నారు. తారకరామా తీర్థసాగరం రిజర్వాయర్ నిర్మాణం ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర రైతాంగం తరపున గొంతెత్తి పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రాంతీయ సదస్సును అనకాపల్లిలో జరుపుతున్నామన్నారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ అనంతరం ఉత్తరాంధ్ర ప్రాంతీయ రైతు సదస్సు కరపత్రాన్ని సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావుతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి, సంఘం నాయకులు మక్కా గురునాయుడు, ధర్మాన రాములు, సూర్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీల విజేతలు వీరే

**మందస, అక్టోబర్ 19(వార్త):** మందస మండలం బహడపెల్లి గ్రామంలో గౌరమ్మ నందన్న సంబరాల సందర్భంగా జిల్లా స్థాయి డాన్స్ పోటీలు జరిగాయి. గ్రూప్స్, సోలో, డ్యూయెట్ విభాగాల్లో 40 టీంలు పాల్గొన్నాయి. గ్రూప్స్ విభాగంలో మొదటి బహుమతి రూ.10వేలను లిటిల్‌స్టార్ ఇచ్ఛాపురం గెలుచుకుంది. డ్యూయెట్ విభాగంలో మొదటి బహుమతి రూ.5వేలను టెక్కలి టీం దక్కించుకుంది. సోలో విభాగంలో మొదటి బహుమతి రూ.4వేలు శ్రీకాకుళం గెలుచుకుంది. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు కర్రి తాతారావు, సాలిని మాధవరావు, సార భాస్కరరావు, సార రవి, కర్రి లచ్చుమయ్య, యువకులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా సినీ నటుడు అమ్మ రామకృష్ణ, గల్లీ గ్యాంగ్‌స్టార్ సినిమా కొరియోగ్రాఫర్ తారక్, వల్లభరావు(టీచర్) వ్యవహరించారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** పోలాకి మండలం అంపలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాశాఖ అధికారి 2 టి.లింగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పబ్లిక్ పరీక్షలను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశంపైన పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కలిగించి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క తొలగింపు



**వంగర, అక్టోబర్ 19(వార్త) :** భాగెమ్మపేట గ్రామంలోని మంచినీటి కోనేరులో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను గ్రామ ప్రజల సహాయంతో సర్పంచ్ ప్రతినిధి రెడ్డి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి పెనుమజ్జి ఇందిర శనివారం తొలగింప జేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పెట్రోల్ బంక్ వద్ద ఆటో డ్రైవర్ల ఆందోళన

**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** నరసన్నపేటలోని ప్రధాన రహదారిలో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. శనివారం మధ్యాహ్నం ఓ ఆటోడ్రైవర్ రెండు లీటర్ల డీజిల్ ఆయిల్ వాహనంలో నింపారు. అయితే కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించిన డ్రైవర్ ఆటో నుంచి మొత్తం ఆయిల్‌ను బయటకు తీయగా లీటర్ మాత్రమే ఉండడంతో ఆందోళన చేపట్టారు.



## వాసుదేవుని దర్శించుకున్న విద్యార్థులు

**మందస, అక్టోబర్ 19(వార్త):** మందసలోని వాసుదేవ ఆలయాన్ని శ్రీసత్యసాయి విద్యావిహార్(పలాస) విద్యార్థులు శనివారం దర్శించుకున్నారు. సుమారు 200 మంది విద్యార్థులు వాసుదేవుని దర్శించుకోగా.. అర్చకులు వారిని ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు ఉమ, జానకిరాణి, మమత, జి.కల్యాణి, కల్పన, కల్యాణి, సునీత, ఎన్.కల్పన తదితరులు పాల్గొన్నారు.






## 'సంపద' కేంద్రాలను వినియోగించండి

**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో ఐ.వి.రమణ అన్నారు. జలుమూరు మండలం రావిపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి చిన్నారావుకు పలు సూచనలు చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** జలుమూరు మండలంలోని అల్లాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పనితీరును ప్రధానోపాధ్యాయులు జామి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు రుచికరమైన ఆహారాన్ని అందజేస్తున్నామన్నారు. విద్యార్థులతో పాటు ప్రతిరోజూ ఒక్కో టీచరు ఆహార నాణ్యతను పరిశీలించాలని కోరారు. ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ సైనిక కుటుంబాలకు గుర్తింపు కార్డులు



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** మాజీ సైనిక ఉద్యోగుల కుటుంబాలకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియను జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ, మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షు రమేశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. స్కాలర్‌షిప్ నమోదు తదితర కార్యకర్తల కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సుమారు 2500 మాజీ సైనికులు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాను నివారిద్దాం

శ్రీకాకుళం, అక్టోబర్ 19(వార్త): శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు శనివారం ఉదయం వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడకను సాగించారు. గ్రామ జ్యోతి సొసైటీ, స్టార్ వాకర్స్ క్లబ్, రోజస్ సంస్థ, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నివారించాలని కోరారు. ఉమెన్ ట్రాఫికింగ్‌కు గురైన వారు హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 181కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రోజస్ సంస్థ అధ్యక్షుడు జీవీ నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, వాసుదేవరావు, బీవీ రవిశంకర్. గుడ్ల జగ్గారావు, డాక్టర్ ఎం.వాసుదేవ్, జి.వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, నల్లబాటి కృష్ణమూర్తి, పూన్న నాగభూషణరావు, పట్నాన రామారావు, గిరిజన ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.




# రైతాంగ సమస్యలపై ప్రభుత్వాల వైఖరి అన్యాయం

**మందస, అక్టోబర్ 19(వార్త):** దేశంలోని రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న వైఖరి అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు ధ్వజమెత్తారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం మట్ట ధర్మారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలు–కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు అనే అంశంపై ఈ నెల 21, 22 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబీ వీకేలో జరిగే జాతీయ సదస్సును జయప్రదం చేయాలన్నారు. వ్యవసాయ సదస్సులో కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, విద్యుత్తు రంగ నిపుణుడు డాక్టర్ కె.అశోక్‌రావు, ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విమోచన చట్టం అమలు, వ్యవసాయ రంగంలో కేరళ రాష్ట్రం అమలు చేస్తున్న రైతు అనుకూల విధానాలు, దేశవ్యాప్తంగా మద్దతు ధరల చట్టం ఆవశ్యకత, విద్యుత్తు రంగంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలు వ్యవసాయ రంగంపై దాని ప్రభావం, సమగ్ర పంటల బీమా ఆవశ్యకత, రైతులు, కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, ఐక్య ఉద్యమాల ప్రాధాన్యత తదితర అంశాలపై ఉపన్యసిస్తారన్నారు. ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానం అమలు చేసి ఈ సంక్షోభ సమయంలో రైతుల ఖాతాలో జమ చేసి ఆదుకోవాలని కోరారు. జీడి పంటను కేంద్రప్రభుత్వం పంటల మద్దతు ధరల జాబితాలో చేర్చాలని, పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ఈ సదస్సులో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టి.లక్ష్మీనారాయణ, అల్లాడ తాతయ్య, ఎన్.చిన్నవాడు, మామిడి బైరి తదితరులు పాల్గొన్నారు.




## హౌసింగ్ కార్యాలయానికి
# దారేది?

**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయానికి దారి లేకపోవడంతో సిబ్బందితో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం ముందు తుప్పలు పూర్తిగా అల్లుకుపోవడంతో అవస్థలు పడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ కార్యాలయానికి వెళ్లాలంటే అంగన్‌వాడీ కార్యాలయం నుంచి డీఈ హౌసింగ్ కార్యాలయం మీదుగా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారి చూపాలని స్థానికులు కోరుతున్నారు.



# మత్స్యకారులూ.. వేటకు వెళ్లొద్దు..!



**వజ్రపుకొత్తూరు,అక్టోబర్ 19(వార్త):** సముద్రంలో మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని, అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా మత్స్య శాఖ డీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం చిన్న కొత్తూరు తుఫాను భవనం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార గ్రామాలైన దేవనల్తాడ, కొత్తపేట, కంబాల రాయుడుపేట, హుకుంపేట, మంచినీళ్లు, నువ్వలరేవు, చిన్న కొత్తూరు, డోకులపాడు, గునుపల్లి, తోటూరు గ్రామాల్లో ఉన్న మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని ఆయన కోరారు.

ఈనెల 22న భారీ తుఫాను ఉన్నందున మత్స్యకారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వలలు, ఫైబర్ బోట్లు, కర్ర తెప్పలు ,ఇతర సామాగ్రి సురక్షిత ప్రాంతాల్లో పరికరాలు భద్రపరుచుకోవాలని ఆయన కోరారు. అన్ని మత్యకార గ్రామాల్లో సొసైటీ అధ్యక్షులకు ఈ తుఫాను హెచ్చరిక విషయాన్ని తెలియజేశామని, మత్స్యకార గ్రామాల్లో దండోరా వేయాలని సూచించారు. మత్స్యకార గ్రామాల్లో ఉన్న తుఫాను భవనాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ డి. సీతారామయ్య, మత్స్యకారులు తదితరులు ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 'అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కల్పించండి'

**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు తెలిపారు. శనివారం ఆయన నరసన్నపేట మండలం మడపాం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందజేస్తున్న ఆహార విషయాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ఆట వస్తువులను అందజేసి, అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.






**వజ్రపుకొత్తూరు, అక్టోబర్ 19 (వార్త):** మారుమూల గ్రామాల అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు శనివారం ఆయన పెద్దబాడం గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని పల్లెలకు తిరిగి పునరుజ్జీవాన్ని ఇవ్వడానికి ఎన్డీఏ కూటమి ప్రయత్నిస్తుందన్నారు. ప్రతీ పల్లెలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కలుగజేసేందుకు చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాలు సర్వ సుందరంగా తీర్చిదిద్దడానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు అరసవెల్లి ఉమామహేశ్వరరావు, పోతనపల్లి సాంబమూర్తి, దువ్వాడ జయరాం చౌదరి, రాపాక శాంత మూర్తి, నెయ్యిల సూర్యనారాయణ,పీత శంకర్రావు, వంకల తిరుపతి, కొల్లి మోహనరావు, గోపాల్, నక్క చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, గ్రామ పోలీసు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



**వంగర, అక్టోబర్ 19(వార్త) :** పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా అరసాడ గ్రామ పంచాయతీలోని అభివృద్ధి పనులకు శనివారం టీడీపీ నేత లచ్చుభుక్త కృష్ణమూర్తి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో పల్లెల అభివృద్ధికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని వారు అహర్నిశలు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా భ్రష్టు పట్టిందని ఆరోపించారు. ఇలాంటి రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్న ఘనత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌దే అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ కోపరేటివ్ ప్రెసిడెంట్ వెంకటనాయుడు, పి.మోహనరావు, ఎంపీడీవో త్రినాథరావు, ఈవో పీఆర్డీ రామారావు, ఆ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కూటమి పెద్దలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లెల్లో అభివృద్ధి పనుల పండుగ



**జలుమూరు, అక్టోబర్ 19(వార్త):** "పల్లె పండుగ" పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సారవకోట మండలం జమచక్రం రోడ్డు నుంచి బుడ్డయ్యపేట వరకు రూ.65 లక్షలు, కిడిమి రోడ్డు నుంచి సోమయ్యపేట వరకు రూ.65 లక్షలు, కిడిమి రోడ్డు నుంచి సింగంవలస వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల్లో ప్రగతికి బాటలు వేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడిపోయిన వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి సరిచేసుకుంటూ, మరోపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ఆమదాలవలస, అక్టోబరు 19 (వార్త):** కూటమి ప్రభుత్వంతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని కొర్లకోట పంచాయతీ సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ అన్నారు. శనివారం ఆమె కొర్లకోట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైన్ల తోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్లు వేసిన దాఖలాలు లేవని, అభివృద్ధి శూన్యం అని, రహదారులు లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. సర్పంచ్ ప్రతినిధి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం చేపట్టి అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు, భాజపా నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ సూరపునాయుడు, జనసేన నాయకులు పేడాడ అప్పలనాయుడు, ఉపసర్పంచ్ కృష్ణారావు గొండు రవి, వార్డు మెంబర్లు, ఆర్అండ్‌బీ జేఈ జ్యోతి, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413